గురుకులాల పదోన్నతుల్లో జాప్యం

- పెండింగ్‌లో 1,650 మంది ఉద్యోగుల ప్రమోషన్లు
- వివిధ స్థాయిల్లో పలు పోస్టులు ఖాళీ
- 140 గురుకులాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే దిక్కు
- గాడితప్పుతున్న గురుకుల విద్యా వ్యవస్థ
- నష్టపోనున్న దళిత, బలహీన వర్గాల విద్యార్థులు

7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

శనివారం 8 నవంబరు 2025

పత్తి రైతుపై సీసీఐ కత్తి!

నిబంధనల పేరుతో తీవ్రమైన ఆంక్షలు



- చుక్కలు చూపిస్తున్న కపాస్ యాప్
- తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత
- 7క్వింటాళ్ల కొనుగోళ్ల నిబంధనతో పరేషాన్
- అంతర్ జిల్లా పత్తి అమ్మకాలపై ఆంక్షలు
- జిన్నింగ్ మిల్లుల కేటాయింపుల్లో గందరగోళం
- ఒకే ధర ఉన్నా.. 3 రకాలుగా మిల్లుల వర్గీకరణ
- సీసీఐ నిబంధనలతో ఆవేదన చెందుతున్నరైతు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి రైతుకు సీసీఐ నిబంధనలు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రకృతి విపత్తులను ఎదుర్కొని కాపాడుకున్న పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. తేమ నిబంధనతో మద్దతు ధరను కోల్పోతున్న రైతులు.. కపాస్ యాప్‌తో మరిన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. పత్తి సాగు వివరాల నమోదుతో పాటు సీసీఐ కొత్తగా ఏడు క్వింటాల్ నిబంధనను తెరపైకి తెచ్చింది. రైతులు పండించిన పత్తిని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని షరతు పెట్టింది. దీంతో సరిహద్దు జిల్లాల్లోని రైతులకు సమస్యగా మారింది. అన్ని జిన్నింగ్ మిల్లులకు బేల్‌కు ఒకే ధర చెల్లిస్తూ.. ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ప్రవేశ పెట్టడంపై జిన్నింగ్ మిల్లర్లు సీసీఐపై మండిపడుతున్నారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని హెచ్చరికలకు దిగుతున్నారు. సీసీఐ నింబంధనల తీరు రైతుల పంట విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అరుగాలం శ్రమించిన పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కూడా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

విపత్తులో సీసీఐ నిబంధనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్‌లో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అష్టకష్టాలు పడి పత్తిని కాపాడుకున్న రైతులపై అక్టోబరు చివరలో వచ్చిన తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పత్తి తీసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో వచ్చిన తుఫాన్ రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తును సైతం కొందరు రైతులు నిలదొక్కుకుని మిగిలిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా సీసీఐ పూటకో నిబంధనను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 8 నుంచి 12శాతం కంటే తేమ మించితే మద్దతు ధర ఇవ్వటం లేదు. ప్రస్తుతం తుఫాన్‌తో (మిగతా 7లో..)

ఎకరాకు ఏడు క్వింటాళ్లేనట..

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్ కూడా రైతులకు చుక్కలు చూపిస్తోంది. వ్యవసాయ అధికారులు ముందస్తుగా రైతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించలేదు. దీంతో నేరుగా స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య నుంచి బయటపడే లోపే మొన్నటివరకు ఎకరాకు 12 క్వింటాళ్ల కొనుగోలు చేసే నిబంధనకు సీసీఐ అంక్షలు విధించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక అధారంగా దిగుబడి తగ్గిందనే సాకుతో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు విక్రయించుకునే విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కౌలు రైతులు, పట్టాబుక్‌లు లేని రైతులు సీసీఐకి పత్తిని అమ్ముకోవటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలు

రైతులపై సీసీఐ మరో నిబంధన బాంబు పేల్చింది. గతంలో రైతులు తమ పంటలను విక్రయించుకునేవారు. అయితే సీసీఐ కొత్త నిబంధన ప్రకారం రైతులు తమ ఉమ్మడి జిల్లా పరిధిలోనే పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఆ విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు పక్కనే ఉన్న కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తిని అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరిహద్దులో ఉన్న మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు ఏటా పత్తిని 25కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. సీసీఐ కొత్త నిబంధనతో ఈసారి జమ్మికుంటలో మొగుళ్లపల్లి రైతులు పత్తిని విక్రయించే అవకాశం లేకుండా పోతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కూడా పత్తి అమ్మకానికి వస్తుంది. కొత్త నిబంధన రైతులకు శాపంగా మారిందనే విమర్శలున్నాయి. అలాగే సీసీఐ చర్యలతో పత్తి కొనుగోళ్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం జిల్లాలో 7లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 8జిన్నింగ్ మిల్లులే ఉన్నాయి. వరంగల్‌లో 10లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 56 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఖమ్మంలో జిన్నింగ్ మిల్లులు ఫుల్ అయితే సీసీఐ కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిన్నింగ్ మిల్లర్లు పేర్కొంటున్నారు. అంతర్ జిల్లాల్లో పత్తి అమ్మకాలపై సీసీఐ అంక్షల పెట్టడంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని.. అరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తిని తమకు నచ్చిన చోట అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ నిబంధనలపై దృష్టి పెట్టి రైతులపై భారం పడకుండా స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



దేశభక్తిని చాటాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- భూపాలపల్లిలో వందేమాతరం గీతాలాపన



అధికారులు, సిబ్బందితో వందేమాతర గీతాలాపన చేపిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశ భక్తినిచాటాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లిలోని ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తిని మరింత పెంపొందించేందుకే సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. భారత చరిత్రలో వందేమాతరం గీతానికి ఎంతగానో విశిష్టత ఉంద న్నారు. జాతీయ భావన, ఐక్యత, సామూహిక భావం పెంపొందిం చేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ట్రైఈ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితోపాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ నిందితులు
- రెండు పిస్టళ్లు, కత్తి, బుల్లెట్ స్వాధీనం
- శాయంపేట పీఎస్‌లో రెండు కేసులు నమోదు
- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి

7



సూరి గ్యాంగ్ వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

బుగులోని జాతరలో భక్తజన సందడి

నాలుగో రోజూ వైభవంగా బ్రహ్మోత్సవాలు

రేగొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : బుగులోని బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుడు కూర్మాచలం వెంకన్న ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. జాతర వైభవంగా జరుగుతోందని, రానున్న రెండురోజులపాటు వరుస సెలవులు ఉండగా భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఈవో శ్రీనివాస్, జాతర చైర్మన్ రమణారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్వామి వారిని కొండ పైనుంచి ఊరేగింపుగా తిరుమలగిరికి చేర్చనున్నట్లు పేర్కొన్నారు. జాతరలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కేడెట్లు సేవలు అందించారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే జాతరకు వచ్చిన భక్తులకు బాల్య వివాహాలపై రిహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ పతినిధి కమల అవగాహన కల్పించారు. జాతరలో సీఐ కరుణాకర్‌రావు నేతృత్వంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టారు. మండల వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో జాతరలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



బుగులోని జాతరలో కిక్కిరిసిన భక్తులు (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

ములుగు జిల్లా అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలి

- క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లను గుర్తించాలి
- నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి అన్వేష్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌కుమార్

ములుగు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ అన్వేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కన్నాయిగూడెం బ్లాక్ కార్యక్రమంపై కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్వేష్‌కుమార్ కన్నాయిగూడెం బ్లాక్ అభివృద్ధిని కొలవడానికి ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం నిర్దేశించిన ఐదు ప్రధాన రంగాల్లో సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం, పోషకాహారం, గర్భిణులకు ప్రథమ త్రైమాసికంలో నమోదు, సంస్థాగత ప్రసవాలు, పిల్లల్లో పోషకాహారలోపం తగ్గింపు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల లభ్యత వంటి అంశాలపై సమీక్షించారు. జిల్లాఅభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లను గుర్తించి ప్రజల జీవితాల్లో త్వరితగతిన మార్పు తీసుకురావాలని సూచించారు.

వ్యవసాయం, అనుబంధ సేవలు, కిసాన్ క్రెడిట్‌కార్డుల పంపిణీ, సూక్ష్మ నీటిపారుదల విస్తీర్ణం, సాయిల్ హెల్త్‌కార్డుల జారీ, పశువులకు టీకాలు వేసే కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి నీటి కనెక్షన్, ఓపెన్ డెఫికేషన్‌ఫ్రీ ప్లస్ గ్రామాల ప్రకటన, భారత్‌నెట్ కనెక్టివిటీ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహాల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. స్వయం సహాయక బృందాలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరు, కొత్త ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల అమలును సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల కలయిక కేంద్ర ప్రభారీ అధికారులు, జిల్లా కలెక్టర్ సహకారం, బ్లాక్‌ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ అనే మూడు ప్రధాన సూత్రాలపైనే ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం విజయవంతంగా ఆధారపడి ఉందని అన్నారు. కన్నాయిగూడెం బ్లాక్‌లో పథకాల అమలులో అధికారుల అంకితభావం అభినందనీయమైనప్పటికీ కీలక సూచికల్లో మరింత వేగంగా అభివృద్ధి సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, మండడలస్థాయి అధికారులు, నీతి ఆయోగ్ బ్లాక్ కోఆర్డినేటర్ రవీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మేడారంలో అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- మేడారం పనుల్లో జాగ్రత్తలు పాటించాలి
- అధికారులపై ములుగు కలెక్టర్ సీరియస్


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ములుగు కలెక్టర్ దివాకర హెచ్చరిం చారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపడుతున్న పనుల్లో జాగ్రత్తలు పాటించాలని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

మేడారంలో ఆయన శుక్రవారం పర్యటించారు. దేవస్థానం పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 'నిండా నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చరిత్రలో నిలిచేలా మేడారంలో శాశ్వత పనులను ప్రభుత్వం చేపడుతోందని, వీటిలో ఎవరు నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అన్నారు. పనుల్లో మరింత వేగం పెంచి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. మేడారం చేరకున్న రాతి కట్టడాలకు సంబంధించిన రాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి వీరస్వామి, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, పలు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండెక్కిన పరిహారం!

- ఐదేళ్లుగా అట్రాసిటీ బాధితుల ఎదురుచూపులు
- జిల్లాలో 45 కేసుల్లో అందని సాయం
- తన వాటాను జమ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- అరకొర చెల్లింపులతోనే సరి



భూపాలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందని ద్రాక్షలా మారింది. నాలుగేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటోంది. దీంతో బాధితులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. అట్రాసిటీ బాధితులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం పెంచి మరింత బలోపేతం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన మొత్తాన్ని సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో బాధితులకు పరిహారం పంపిణీలో జాప్యమవుతోంది. 2018-19 వరకు బాధితులకు పరిహారం ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగినా 2020-21 నుంచే సమస్యలు మొదలయ్యాయని తెలుస్తోంది. చెల్లింపుల్లో జరుగుతున్న తీవ్రమైన జాప్యంతో బాధితులకు న్యాయ సహాయం లభించని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ కేసుల్లోని బాధితులకు కోర్టులకు హాజరయ్యేందుకు ఖర్చులు కూడా లేక సాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది.

భూపాలపల్లి జిల్లాకు సంబంధించి 2020 నుంచి ఇప్పటి వరకు దాదాపు 45 కేసుల్లో బాధితులకు సుమారు రూ. 70 లక్షల మేర పరిహారం చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. 1989 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిబంధనలను అనుసరించి ఈ కేసుల్లో ఎఫ్‌ఐఆర్ (ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదైన వెంటనే ప్రభుత్వం తక్షణ సాయం కింద 25శాతం పరిహారాన్ని చెల్లించాల్సి ఉంది. అలాగే కోర్టులో చార్జిషీట్ వేయగానే మరో 50శాతం, శిక్షలు ఖరారైన తర్వాత మిగతా 25శాతం పరిహారాన్ని బాధితులకు ఇవ్వాల్సి ఉంది. కానీ, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన మొత్తాన్ని జమ చేయకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ఈ చట్టం కింద కేసు నమోదు కాగానే కేసు తీవ్రతను బట్టి ప్రభుత్వపరంగా రూ. లక్ష నుంచి రూ. 8.75 లక్షల వరకు పరిహారాన్ని మూడు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది.

అత్తెసరు చెల్లింపులు

అట్రాసిటీ చట్టం ప్రకారం మూడు విడుతల్లో పూర్తి సొమ్ము చెల్లించాల్సి ఉన్నా జిల్లాలో అనేక కేసుల్లో ఒక్క విడతలో నామమాత్రంగా సాయం అందించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి కోర్టులో విచారణ దశలో ఉన్న కేసులకు కూడా 25 శాతం మాత్రమే చెల్లింపులు జరగడం గమనార్హం. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామానికి ఎస్టీ బాధిత కుటుంబంపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసిన ఘటనలో ఇప్పటి వరకు తక్షణ సాయం కింద రూ.25వేల సహాయం మాత్రమే అందించారు. మిగతా రెండు విడతల పరిహారానికి ఇప్పటికీ మోక్షం లభించలేదు. ఇదే మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామంలో కులం పేరుతో దూషించిన ఘటనలో 2023లో కేసు నమోదు కాగా బాధిత కుటుంబానికి ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. అలాగే మొగుళ్లపల్లి మండలం నరసింగాపూర్ (మిగతా 8వ పేజీలో)

సాక్షిగా ఉన్నాడనే ఫొటోగ్రాఫర్ హత్య

● కొండాపూర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు ● తొమ్మిది మంది నిందితుల అరెస్టు.. రిమాండ్ ● కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ భీమాశర్మ

చిలుపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జనగామల జిల్లా చిలుపూర్ మండలం కొండాపూర్‌లో ఇటీవల జరిగిన ఫొటోగ్రాఫర్ ముత్యాల సురేశ్ (34)హత్య కేసును పోలీసులు ఛేదించారు. భూతగాదా కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడనే కక్షతోనే పక్కాప్లాన్‌తో సురేశ్‌ను దారుణంగా హత్యచేశారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమాశర్మ, జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి ఘటన వివరాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం. గ్రామానికి చెందిన మోతె జితేందర్, మోతె జిన్ను అన్నదమ్ములకు, అదే గ్రామానికి చెందిన మోతె కిష్టయ్య, మోతె రాములు, ముత్యాల సంపత్‌కు మధ్య కొన్నేళ్లుగా భూతగాదాలున్నాయి. ఈ విషయమై రెండేళ్ల క్రితం చిలుపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఆ కేసులో అదే గ్రామానికి చెందిన మాచర్ల రమేష్‌తోపాటు, ముత్యాల సురేశ్ ప్రధానసాక్షిగా ఉండడమే కాకుండా, ఘటనను వీడియో తీశాడు. అప్పటి నుంచి కక్ష పెంచుకున్న నిందితులు జితేందర్, జిన్నులు వీరిని ఎలాగైనా అంతమొందించాలని కుట్రపన్నారు. పతకం ప్రకారం ఈనెల 2న వారి స్నేహితులైన అమ



హత్యకేసులో నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ర్నాథ్, సాయిరాం, పోకల దిలీప్, గట్టు శివరామ్, ఈరెల్లి చందు, ఎమ్డీ రహమాన్‌ల సహకారంతో రెండు స్కూటీలపై కొండాపూర్‌కు చేరుకున్నారు. దారికాచి మొదట మాచర్ల రమేష్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. అతను తప్పించుకుని పారిపోగా, తర్వాత ముత్యాల సురేష్‌ను దొరికించుకుని స్కూటీపై బలవంతంగా ఎక్కించుకుని గ్రామ సమీపంలో ఉన్న మామిడితోటలోకి ఎత్తుకెళ్లారు. అనంతరం నిందితులు జితేందర్, జిన్ను, వారి తల్లి కనకమ్మ మూకుమ్మడిగా సురేశ్‌పై తీవ్రంగా దాడి చేసి తలపై గొడ్డలి కామతో కొట్టారు. వెంట తెచ్చుకున్న చీరతో చేతులను కట్టేసి మెడకు ఉరివేసి బిగించి హత్యచేశారు. మృతుడు సురేశ్ భార్య కావేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనలో తొమ్మిది మంది నిందితులు మోతె జితేందర్, మోతె జిన్ను, వీరి తల్లి మోతె కనకమ్మ, అమర్నాథ్, సాయిరాం, పోకల దిలీప్, గట్టు శివరామ్, ఈరెల్లి చందు, ఎమ్డీ రహమాన్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. కాగా, కేసును త్వరితగతిన చేధించిన సీఐ శ్రీనివాసరెడ్డి, చిలుపూర్, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సైలు సిరిపురం నవీన్‌కుమార్, నరేష్, బొల్లం వినయ్‌కుమార్‌లను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ అభినందించారు.

ట్రాన్స్‌జెండర్ల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు

తాడ్వాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానం వద్ద ట్రాన్స్‌జెండ్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వీరిలో పలువురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకోగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ములుగు జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్లు మేడారం వద్ద భిక్షాటన చేస్తూ అక్కడే అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఇదే క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన ట్రాన్స్‌జెండర్లు వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చి పక్కనే ఉన్న గదిలో తాత్కాలింగా బస చేశారు. ఈ క్రమంలో ఓ విషయంలో ములుగు జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ట్రాన్స్‌జెండర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారి తీసింది. మేడారంలో స్థానికంగా నివాసం ఉంటున్న ట్రాన్స్‌జెండర్, ములుగు జిల్లా అధ్యక్షురాలు ఇందూనాయక్, ఇంద్రజ, సుమలత, సురేఖ, విజ్జి, అవంతిక నాయక్, సుమ తదితరులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన ట్రాన్స్‌జెండర్లు సారిక (దండు సారయ్య), వాగాదేవి, వారి బంధువులు నాజ రాజు, గోపి, మహేష్ మేడారానికి దర్శనం నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో స్థానికంగా నివాసం ఉంటున్న ములుగు జిల్లా ట్రాన్స్‌జెండర్ల గది పక్కనే మరో గదిలో తాత్కాలిక అద్దెపై బస చేశారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం మద్యం తాగి పక్కనే స్థానిక ట్రాన్స్‌జెండర్ల గదికి వచ్చి మాటలు కలిపారు. ఈ క్రమంలో భిక్షాటన చేయడానికి సిగ్గులేదా? అని స్థానిక ట్రాన్స్‌జెండర్లను రెచ్చిగొట్టారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారి తీసింది. దీంతో రెండు వర్గాలలోని ట్రాన్స్‌జెండర్లు పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం గొడవ పడ్డ రెండు వర్గాలలోని ఇద్దరు ముఖ్యులను తహసీల్దార్ ఎదుట ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి బైండోవర్ చేశారు. మరో సారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం


బీమా మురళి

నర్మెట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూరులో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ఎన్.నగేష్ కథనం ప్రకారం. బొమ్మకూరుకు చెందిన 55ఏళ్ల బీమా మురళి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, ఈనెల 4న ఉదయం వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. వ్యవసాయ బావి చుట్టు పక్కల వెతికినా కనబడలేదు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల దగ్గర వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో మురళి భార్య పుష్ప శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.నగేష్ తెలిపారు.

వ్యర్థాలు తిని దుక్కిటెద్దు మృతి

తాడ్వాయి, నవంబరు 7(ఆంధ్రజ్యో తి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ గ్రా మానికి చెందిన దా రావత్ బిచ్చా నాయ క్ అనే రైతు దుక్కిటెద్దు వ్యర్థాలు తిని మృతి చెందిందని స్థానిక పశుసంవర్థక సిబ్బంది తెలిపారు. మేడారం వనదేవతలును దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు పరిసర అటవీ ప్రాంతాల్లో వదులుతున్న వ్యర్థాలు, పేపర్, ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లను తిని జీర్ణం కాక కడుపు ఉబ్బి చనిపోయిందని అన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



శిబిరంలో మాట్లాడుతున్న పింకేశ్‌కుమార్

చిలుపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పింకేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలం రాజవరం కేజీబీవీలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యాసంస్థలు, ఆలయాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, డ్రగ్స్, మహిళా సాధికారత, శ్రమదానం, స్వచ్ఛ భారత్ ప్లాస్టిక్ నిసేధం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ, జీసీడీవో గౌసియాబేగం, ఎస్‌వో ప్రశాంతి, ప్రోగ్రాం అధికారి దివ్య పాల్గొన్నారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలో గుడుంబా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మేరకు ఎస్సై ఎన్.రాజ్‌కుమార్ నేతృత్వంలోని పోలీస్ సిబ్బంది రొయ్యూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన దొంగ్రీ రాజశేఖర్ అనే వ్యక్తి అక్రమంగా గుడుంబా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. దీంతో ఘటన స్థలంలోనే అతడిని పట్టుకొని, అతని వద్ద ఉన్న 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.


గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కొత్త ఒరవడికలతో రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దేశీ డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ప్రోగ్రామ్‌లో ఇన్‌పుట్ డీలర్లతో ఆయన మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పురుగు మందు దుకాణాలు నిర్వహించుకోవడానికి అవకాశం లభించిందని, 7వ బ్యాచ్‌లోని వ్యక్తులు సైతం అవగాహన కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. ఇన్‌పుట్ డీలర్లు రైతులకు నమ్మకమైన సమాచారం అందించాలని, వ్యవసాయ శాఖ ఉత్పత్తులు పెంచడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

పైపులైన్ పనుల్ని పరిశీలించిన ఎమ్మెల్యే

తరిగొప్పుల/నర్మెట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవాదుల ఫేజ్ 2 పనుల్లో భాగంగా మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి బొత్తలపర్రె మినీ రిజర్వాయర్ వరకు చేపడుతున్న పైపులైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి నర్మెట మండల గండిరామవరం శివారులో పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను తరిగొప్పుల, స్టేషన్ ఘన్‌పూర్ మండలాలకు సాగునీరు అందించడం జరుగుతోందన్నారు. పైపులైన్ పనుల్లో వేగం పెంచి యాసంగి సీజన్ నాటికి రైతులకు గోదావరి జలాలను అందుబాటులోకి తీసుకురావాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చిల్పూర్‌గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, బొమ్మిశెట్టి బాలరాజు, పొలపెల్లి రంజిత్ రెడ్డి, గడ్డమీది సురేష్, రంగు రమేష్ గౌడ్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కడియం

రేపటి నుంచి దూరవిద్య పీజీ తరగతులు

కేయూ క్యాంపస్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నవంబరు 9 ఆదివారం నుంచి జరుగుతాయని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 9, 11, 23, 30 తేదీల్లో డిశంబరు 7, 13, 14, 21, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి కేయూ దూరవిద్యం కేంద్రంతో పాటు ఎంపిక చేసిన అధ్యయన కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు. ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, హిస్టరీ, హెచ్‌ఆర్ఎం, సోషియాలజీ, ఎంకామ్ తరగతులు జరుగుతాయని వెల్లడించారు. మంచిర్యాల, నిర్మల, మణుగూరు, భద్రాచలం, ఖమ్మం, కౌటల, నర్సాపూర్‌లలో అధ్యయన కేంద్రాల్లో ఎంపిక చేసిన సబ్జెక్టుల్లో కాంట్రాక్టు తరగతులు జరుగుతాయని వెల్లడించారు.

రామప్పను సందర్శించిన నీతి ఆయోగ్ అధికారి

వెంకటాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ అన్వేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయనను ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించి పట్టువస్త్రాలు అందజేశారు. ఈసందర్భంగా అన్వేష్‌కుమార్ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని తిలకించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీడీ వెంకటనారాయణ, ఏపీవో రాజు, నీతి ఆయోగ్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.


రామప్ప ఆలయాన్ని వీక్షిస్తున్న అన్వేష్‌కుమార్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్టీ గురుకుల విద్యార్థులు

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభను చాటారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో వివిధ క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 19మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పీడీ గౌతమి, పీఈటీ శ్రీదేవి శుక్రవారం తెలిపారు. టగ్ ఆఫ్ వార్‌లో శ్రీజ, హారిక, నిఖిల, అలేఖ్య, క్రికెట్‌లో సంగీత, సుచరిత, సాయి కీర్తన, హ్యాండ్‌బాల్‌లో సాయికీర్తన, శ్రీలేఖ, బ్యాడ్మింటన్‌లో రమ్య, శరణ్య కుమారి, సాఫ్ట్‌బాల్‌లో సుచరిత, నెట్‌బాల్‌లో వైష్ణవి, బేస్ బాల్‌లో సుచరిత, 1500 మీటర్ల రన్నింగ్‌లో సోనీ, షైనీ, 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో సాయికీర్తన సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. హైదరాబాద్ లో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ పీడీ, పీఈటీతోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ సరిత, కల్పన, ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ

హోరాహోరీగా జోనల్ క్రీడా పోటీలు

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జరుగుతున్న భద్రాద్రి మల్టీజోన్ క్రీడా, స్పోర్ట్స్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. జట్టు జట్టు మధ్య ఉత్కంఠ పోరు జరిగింది. రెండో రోజు ఆటలు ముగిసే సమయానికి రన్నింగ్, హైజంప్, క్యారమ్స్, చెస్ పోటీలలో వివిధ గురుకుల స్కూల్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జోనల్ టోర్నీ పోటీలు ఎంతో రసవత్తరంగా నిలిచాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నువ్వా నేనా.. అన్నట్లు వివిధ పాఠశాలల జట్టు తలపడ్డాయి. అథ్లెటిక్స్ పోటీలు విద్యార్థుల మధ్య హోరెత్తించాయి. రెండో రోజు ఆటలు ముగిసేసరికి అండర్ 14 చెస్ పోటీలలో మరిపెడ, నర్సంపేట, పాల్వంచ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్ 17లో పాల్వంచ, దమ్మపేట, అండర్ 19 విభాగంలో పాల్వంచ, ముదిగొండ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎం.నిఖిల్ (మణుగూరు), ఆర్.సాంబశివ (మరిపెడ), టి.సన్నీ (వర్ధన్నపేట), అండర్ 17 విభాగం 1500 మీటర్ల రన్నింగ్ పోటీలలో వి.రాహుల్ (పాల్వంచ), ఎం.బన్నీ (దమ్మపేట), ఆర్.లోకేశ్ (పాల్వంచ), అండర్ 19లో జీఎల్‌కే మాధవ్ (పాల్వంచ), జె.గౌతమ్ (దమ్మపేట), టి.కార్తీక్ (పాల్వంచ) గురుకుల స్కూల్స్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. క్యారమ్స్ పోటీలలో పాల్వంచ, మరిపెడ విద్యార్థులు గెలుపొందారు. క్రీడా, స్పోర్ట్స్ పోటీలకు హాజరైన విద్యార్థులకు నిర్వాహకులు, పౌష్టికాహారం, వసతి సౌకర్యాలు కలిపించారు..


కబడ్డీ పోటీలలో తలపడుతున్న జట్లు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

చిలుపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేజీకేఎస్ (కల్లుగీత కార్మిక సంఘం) జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య ఆరోపించారు. శుక్రవారం చిలుపూర్‌లో నిర్వహించిన నాలుగో మండల మహాసభకు ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఉప్పలయ్య మాట్లాడుతూ వివిధ కారణాల రీత్యా ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయడంలోనూ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. 28, 29, 30 తేదీల్లో సూర్యాపేట పట్టణంలో నిర్వహించే మహాసభలకు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, మండలాధ్యక్ష, కార్యదర్శులు గనగోని రమేష్, కంకటి రాజన్న, టీవీ రాజేశ్వర్, మాచెర్ల ప్రవీన్, నారగోని రాజు గౌడ్, రంగు రవి, బైరగోని మల్లయ్య, తౌటి సునీల్, నారగోని శ్రీనివాస్, వడ్ల కొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు .

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి


చైర్మన్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

చిలుపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్‌వి వేణుగోపాలచారి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జనగామ జిల్లా చిలుపూర్‌లోని సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల ఫో రం ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాలచారి మాట్లాడుతూ కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్లను మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, సర్వీస్‌ల పేరుమార్పు, నూతన సర్వీసుల మంజూరు, కేటగిరీ మార్పు, లోపాలు గల మీటర్లను మార్చడం తదితర సమస్యలకు ఈ వేదిక తక్షణ పరిష్కారం చూపనుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ రాంబాబు, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో టీ-శాట్ పోటీలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీ-సాట్, టీఎస్ జీహెచ్‌ఏ సౌజన్యంతో భూపాలపల్లి మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. భూపాలపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పవన్ కుమార్ ఉపన్యాస పోటీల్లో ప్రథమ, వ్యాసరచన పోటీల్లో పూర్ణచందర్ ప్రథమ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీల్లో గొల్లబుద్దారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాల్గొని ప్రథమ బహుమతి అందుకున్నారు. వీరికి ఎంఈవో దేవానాయక్ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన ఎంఈవో దేవానాయక్

పదోన్నతిపై సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

వరంగల్ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ముగ్గురు జడ్జిలకు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కమ్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న క్షమాదేశ్ పాండేను వరంగల్ అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు(ఏసీబీ) జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా నర్సంపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వరూధినికి అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ నిజామాబాద్ నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించింది. జనగామ సీనియర్ సివిల్ జడ్జి కమ్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విక్రమ్‌ను కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం వరంగల్ అర్బన్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అబ్జర్వర్ ఎక్సైజ్ సీఐ బి.ప్రభావతి తెలిపారు. అధ్యక్షుడిగా ఖిలావరంగల్ సీఐ కె.రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా హనుమకొండ ఎస్సై సీహెచ్.వెంకన్న, వైస్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, జనరల్ సెక్రటరీగా పరకాల ఎస్సై వై.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జనగామ సూపరింటెండెంట్ జనార్దన్, జాయింట్ సెక్రటరీగా జనగామ సీఐ బి.ప్రభావతి, కోశాధికారిగా వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.నాగయ్య, ఈసీ మెంబర్స్‌గా నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి, వరంగల్ అర్బన్ ఎస్సై ఎస్.పద్మ, వర్ధన్నపేట ఎస్సై వి.గంగాధర్, తొర్రూర్ ఎస్సై ఎం.రవళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ.. అధికారుల సర్వీసుకు సంబంధించి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

- నెల రోజులుగా కుటుంబ సభ్యులతో పరారీ

శాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు పాల్పడిన ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో గత రబీ సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రూ.1.87 కోట్లు అక్రమాలు జరిగినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. దీనిపై అక్టోబరు 11న శాయంపేట పీఎస్‌లో 21 మందిపై కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడు మిల్లర్ బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో సహా గత నెల రోజులుగా పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నా లభించలేదు. దీంతో పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈనేపథ్యంలో పక్క రాష్ట్రంలోని గుంటూరులో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పోలీసులు 8 మంది కుటుంబ సభ్యులతో సహా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులను విచారిస్తున్నట్లు సమాచారం.

గురుకులాల పదోన్నతుల్లో జాప్యం

- పెండింగ్‌లో 1,650 మంది ఉద్యోగుల ప్రమోషన్లు
- వివిధ స్థాయిల్లో పలు పోస్టులు ఖాళీ
- 140 గురుకులాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే దిక్కు
- గాడితప్పుతున్న గురుకుల విద్యా వ్యవస్థ
- నష్టపోనున్న దళిత, బలహీన వర్గాల విద్యార్థులు



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్ పరంగా, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక ఏళ్లుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావలసి ఉంది. కింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదు కానీ, పైస్థాయిలో మాత్రం ఉన్నతాధికారులు పదోన్నతుల మీద పదోన్నతులు అక్రమంగా పొందుతున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు ఉన్నాయి.

సీనియారిటీ లిస్టు ప్రకటించినా..

ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగుల ఫైనల్ సీనియారిటీ లిస్టును అన్ని కేడర్లలో ప్రకటించారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి జోనల్ ఆఫీసర్, జాయింట్ సెక్రెటరీ స్థాయి వరకు చెక్ స్లిప్స్ కూడా తీసుకున్నారు. దీనితో పదోన్నతుల ప్రక్రియ ఇక పూర్తవుతుందని ఉద్యోగులు ఆశపడ్డారు. ఇంతలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిని కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌కు బదిలీ కావడంతో ఈ ప్రక్రియ అటకెక్కింది. ప్రస్తుతం క్రిష్ణ ఆదిత్య ఎఫ్ఏసీ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ పదోన్నతుల ప్రక్రియలో కదలిక లేదు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చాలా వాటికి పూర్తి స్థాయి ప్రిన్సిపాళ్లు కూడా లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవంలేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడితప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలామంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారే. దీనితో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోంది.

పైస్థాయిలో అక్రమ పదోన్నతులు

జోనల్ ఆఫీసర్స్, జాయింట్ సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిల్లో కూడా ఉద్యోగ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్రెటరీలకు డిప్యూటీ సెక్రెటరీగా ఒక పోస్టుకు మాత్రమే అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ గురుకుల నిబంధనలకు విరుద్ధంగా 5 పోస్టుల్లో డిప్యూటీ సెక్రెటరీలుగా పదోన్నతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా అక్రమంగా ప్రమోషన్లు పొందిన వారిని వెంటనే రివర్టు చేసి ఆ పోస్టుల్లో సీనియర్ ప్రిన్సిపాల్స్‌కు జోనల్ అధికారి, డిప్యూటీ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలుగా పదోన్నతులు కల్పించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఒక జోనల్ అధికారి మూడు జోన్ల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి పనిభారం ఎక్కువ కావడం వల్ల పర్యవేక్షణ లోపించి గురుకులాల పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

తక్షణం పదోన్నతులు కల్పించాలి

అలగోని నరసింహులు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో 1650 మంది ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 250మంది నుంచి 300 మందికి ప్రమోషన్లు రావలసి ఉన్నది. పదోన్నతులు ఇవ్వడంలో ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే బలహీన వర్గాలు, ఎస్సీ దళిత విద్యార్థులు చదువుతున్న సంక్షేమ గురుకులాల్లో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని, పర్యవేక్షణ లోపం వల్ల గురుకుల వ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీనియారిటీ ప్రకారం అర్హులైన సంక్షేమ గురుకుల ఉద్యోగులు, జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ జోనల్ ఆఫీసర్, డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ స్థాయిల్లో పదోన్నతులు కల్పించాలి.

గంగదేవిపల్లిని సందర్శించిన నేపాల్ దేశస్థులు

- జాతీయ గీతాన్ని ఆలపించిన విదేశీ బృందం



గ్రామస్థులు, విద్యార్థులతో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నేపాల్ బృందం

గీసుగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని నేపాల్ దేశానికి చెందిన 15 స్వచ్ఛంద సంస్థల 17 మంది ప్రతినిధి బృందం బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా వందేమాతరం గీతం ఏర్పాటై 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, గ్రామస్థులతో పాటు వందేమాతరం గీతాన్ని వారు ఆలపించారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామం అభివృద్ధి చెందిన తీరు, జాతీయస్థాయికి ఎదిగిన విధానం, సాధించిన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గురించి విదేశీ బృందానికి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. గ్రామాభివృద్ధిని, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యాన్ని ప్రతినిధి బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ సింగారెడ్డి సునీత, కొట్టె రమాదేవి, విదేశీ బృందం ప్రతినిధులు త్రిబేనికుమార్ యాదవ్, జనక్‌కర్కి, రుక్మణికర్కి, అర్చన చౌదరి, గుణేష్ బహదూర్ ఠాకూర్, విష్ణుప్రసాద్ కున్వర్, ఉమేష్‌న్యూపానె, బినోద్ కుమార్ బిషంకే, హరినారాయణ్‌ప్రసాద్, సంజయ్‌కష్యాపాహీ, శత్రుఘ్నసింగ్, దివాకర్‌ఝా, రౌనక్‌రాజ్, చాందనీషా, శ్యామ్‌సుందర్ సింగ్, స్థిరానాబస్నెట్, శ్యామ్‌కుమారీసాహ్, గ్రామ కార్యదర్శి రమ్య కుమారీ, నిమ్మల శేఖర్, గోనె నాగరాజు, హెచ్ఎం రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగృతి జనం బాటను
జయప్రదం చేయాలి

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కవిత పర్యటన
- తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్

వడ్డెపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం, ఆదివారం నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ జాగృతి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రైతులు పండించిన ధాన్యం తడిచిపోవడంతోపాటు వరి చేళ్లు నేలబారి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రైతుల సమస్యలను గాలికి వదిలి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మునిగారని దుయ్యబట్టారు. మహిళా సాధికారత కేవలం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకే సాధ్యమవుతుందని చెప్పారు. వరంగల్, హనుమకొండ జిల్లాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే జాగృతి జనం బాటలో భాగంగా మేధావులు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, విద్యార్థులతో మమేకమవుతారని అన్నారు. కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో దెబ్బతిన్న వరిచేళ్లను పరిశీలిస్తారని చెప్పారు. ఉనికిచర్ల ఎక్స్ రోడ్డు దగ్గర జాగృతి జిల్లా శ్రేణులు కవితకు స్వాగతం పలికి బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం హనుమకొండలో తుఫాన్ తాకిడితో దెబ్బతిన్న సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, అమరావతి నగర్ ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రులు, ఎస్ఆర్ నగర్ వంటి ప్రాంతాలను సందర్శిస్తారని జాగృతి శ్రేణులు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పర్లపెల్లి శ్రీశైలం, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మేకల రాణి, నేతలు మంజుల, వంశీకృష్ణ, సోల్తి కిశోర్, జన్ను సంతోష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న లకావత్ రూప్‌సింగ్, మారేపల్లి మాధవి

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ

- స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నేపథ్యంలో..
- తిరిగి నిర్వహించే సమయానికి నవీకరణ
- ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలు



హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రస్తుతం వాయిదా పడడంతో తిరిగి ఎన్నికలు జరిగే నాటికి కొత్త ఓటర్లను నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళితే అప్పటికప్పుడు కొత్త జాబితా రూపొందించడం కష్టంగా మారుతుందని ఇలా ముందస్తు ఓటర్ల జాబితా నవీకరణ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ దిశగా నవీకరణ ప్రక్రియను చేపట్టింది. ఈ విషయంలో ఇప్పటికే అధికారులు ఈ విషయమై క్షేత్ర స్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల ప్రకటన వచ్చే సరికే తాజా ఓటరు జాబితా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అందుకు ఆయా పంచాయతీల్లో వార్డుల వారీగా కొత్త ఓటర్లు ఎంత మంది ఉన్నారో చూస్తున్నారు.

మరోమారు నవీకరణ

స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను మరోమారు నవీకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను రెండు మార్లు సవరించారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా పడడంతో తాజాగా మరోమారు నవీకరిస్తున్నారు. ఈనెల 15 వరకు నమోదయ్యే వారి వివరాలను జాబితాలో చేర్చనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,45,553 మంది ఓటర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3,72,646, వరంగల్ జిల్లాలో 3,85,163, జనగామ జిల్లాలో 4,01,115, మహబూబాబాద్ జిల్లాలో 5,51,999, ములుగు జిల్లాలో 2,31,052 , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,03,556 మంది ఓటర్లు ఉన్నారు.

అవగాహన కార్యక్రమాలు

కొత్త ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల్లో 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకునే విధంగా కొన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనితో ఎక్కువ మంది ఓటర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో విద్యాసంస్థల నుంచి ఏటా 10వేలకు పైగా 18 సంవత్సరాలు దాటే వయోజనులు పై తరగతులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అవగాహన కార్యక్రమాల ద్వారా కొత్త దరఖాస్తులు చేయిస్తే అటు కేంద్ర ఎన్నికల సంఘం జాబితాలో ఇటు స్థానిక సంస్థల ఎన్నికల జాబితాలో వారికి చోటు లభిస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా సైతం..

జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, ఓటర్ల జాబితా సవరణ సంవత్సరం అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఫారం-6 నింపడం ద్వారా ఓటరుగా నమోదు కావచ్చు. నమోదైన ఓటర్లు తమ నమోదు స్థితిని కూడా తనిఖీ చేసుకోవచ్చు. సాధారణ ఓటర్లు ఫారం-6(ఆన్‌లైన్ ఫారం లింక్) నింపాలి. ఇది కొత్త ఓటర్ల నమోదు కోసం మాత్రమే. ఎన్ఆర్ఐ ఓటరు ఫారం-6ఏ నింపాలి. (ఆన్‌లైన్ ఫారం లింకు).

పత్తి రైతుపై సీసీఐ కత్తి!

(5వ పేజీ తరువాయి)

పత్తి పంట మొత్తం నీట మునిగింది. ఇళ్లలో ఆరబెట్టినప్పటికీ పత్తికి కూడా వరుస వర్షాలతో నిమ్ము చేరింది. పత్తిని ఎండలో ఆరబెడతామంటే మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణంలోనే తేమ పెరిగి ఉందని, అలాంటప్పుడు 12శాతం లోపు తేమతో పత్తిని మార్కెట్‌కు తీసుకరావటం ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధరలో కోత పెడుతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తేమ శాతాన్ని 18 నుంచి 30 శాతానికి పెంచాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

జిన్నింగ్ మిల్లర్లతో కొర్రీలు

పత్తి విక్రయానికి వచ్చినప్పటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తీసుకువస్తున్న నిబంధనలు రైతుకు గుదిబండగా మారుతున్నాయి. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయితీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు జిన్నింగ్ మిల్లుల యాజయాన్యాలు నిరాకరించాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక చొరవతో జిన్నింగ్ మిల్లుల పంచాయితీ ఓ కొలిక్కివచ్చినట్టే వచ్చినా.. మళ్లీ సీసీఐ కొర్రీలతో మొదటికి వస్తోంది. తెలంగాణలోమొత్తం 322 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 మిల్లులను గుర్తించారు. ఒక పత్తి బేల్‌కు రూ.1,440లు చెల్లించేందుకు మిల్లు యాజమానులతో సీసీఐ ఒప్పందం చేసుకుంది. అక్టోబరు చివరివారంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట వర్గీకరించింది. కపాస్ యాప్‌లో తొలుత ఎల్-1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్-2కు, ఆ తరువాత ఎల్-3 మిల్లులకు అవకాశం ఇస్తోంది. ఈ విధానంపై జిన్నింగ్ మిల్లర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. రైతులు తమ ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశాన్ని చేజార్చుకుంటున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి జాబ్ వర్క్ టెండర్లు ఇవ్వలేదని, అన్ని మిల్లుల్లో బేల్‌కు ఒకటే ధర చెల్లిస్తున్నారని, అలాంటప్పుడు మిల్లుల వర్గీకరణ ఎందుకని, అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితోపాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడిన నిందితులు
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న పిస్తోళ్లు, కత్తి, బుల్లెట్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ దాసరి సురేందర్ అలియాస్ సూరి పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనతో పాటు గన్‌గ్యాంగ్ సభ్యులైన ఏడుగురిని పట్టుకున్నారు. గత నెల 18న హనుమకొండ జిల్లా శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాందారిపేట క్రాస్‌రోడ్డు వద్ద లారీ డ్రైవర్‌తో పాటు పెట్రోల్ పంపు నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించిన సంఘటనలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పలు సెక్షన్‌ల కింద రెండు కేసులు నమోదు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. రెండు పిస్తోళ్లు, ఒక కత్తి, ఒక బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన దాసరి సురేందర్ అలియాస్ సూరి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఈయనపై రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో రౌడీషీట్‌తోపాటు 3సార్లు పీడీ యాక్టు నమోదు, 2 పోక్సో కేసులు, భార్య హత్య కేసు, దాదాపు 44 కేసులు నమోదయ్యాయి. దీంతో సూరిని అక్కడి పోలీసులు గత ఏప్రిల్‌లో నగర బహిష్కరణ చేయగా, తన మకాంను హనుమకొండలోని భీమారానికి మార్చారు. ఈ క్రమంలో స్థానిక యువకులను చేరదీసి గ్యాంగ్ నిర్వహిస్తూ గంజాయి సేవించేవాడు. ఈ క్రమంలో సురేందర్ అనుచరుడైన భూపాలపల్లికి చెందిన బాసిత్‌ను ఇటీవల కొందరు యువకులు గ్యాంగ్‌వార్‌లో భాగంగా హత్య చేశారు. బాసిత్‌ను హత్య చేసిన సోనూ, బబ్లూను చంపేందుకు బాసిత్ బావ ఖారుఖ్‌ఖాన్ సూరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా గత అక్టోబరు 18న సూరి మరో ఏడుగురు వ్యక్తులను రెండు ద్విచక్ర వాహనాలపై ఎక్కించుకొని శాయంపేట పీఎస్ పరిధిలోని మాందారిపేట గుట్టలకు చేరుకొని అక్కడ మద్యం సేవించారు. అనంతరం మాందారిపేట క్రాస్ వద్ద లారీ డ్రైవర్‌ను ఆపి పిస్తోల్‌తో కొట్టి బెదిరించారు. అక్కడి నుంచి సమీపంలోని భారత్ పెట్రోల్‌పంపులోకి వెళ్లి పెట్రోల్ పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించి పారిపోయారు. సిరిసిల్లకు చెందిన లారీడ్రైవర్ కొమిరె రజినీకాంత్ ఫిర్యాదు మేరకు శాయంపేట ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం కొత్తగట్టు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సురేందర్‌తో పాటు అతడి అనుచరులు ఏడుగురు, రెండు పిస్తోల్స్, ఒక బుల్లెట్, కత్తితో పట్టుబడ్డారని డీసీపీ వివరించారు.

బిహార్ నుంచి పిస్తోల్స్ కొనుగోలు

రౌడీషీటర్ సురేందర్ జైలులో ఉన్నప్పుడు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యకుమార్ ఠాకూర్ పరిచయమయ్యాడు. 4 నెలల కిందట బిహార్‌లోని భగల్పూర్ జిల్లా నగోచియ మండలంలోని నగర గ్రామంలో కుందన అనే వ్యక్తి నుంచి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్, ఒక్క బుల్లెట్‌కు రూ.500 చొప్పున 9 బుల్లెట్‌లు కొనుగోలు చేశాడు. నెల తర్వాత సురేందర్ గ్యాంగ్‌లో సభ్యుడైన ములుగు జిల్లాకు చెందిన సామ్రాజ్ చక్రికి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్‌తో పాటు 6 రౌండ్స్‌లు కొనుగోలు చేసి ఇచ్చాడు. కాగా, ఇవే పిస్తోల్స్‌తో శుక్రవారం శాయంపేట పోలీసులకు సురేందర్‌తో పాటు ములుగుకు చెందిన సామ్రాజ్ చక్రి, భీమారానికి చెందిన చంచు రాహుల్, కోమటిపల్లికి చెందిన నమిండ్ల శివ, భీమారానికి చెందిన డాగ్ ట్రాన్స్‌పోర్టర్ రౌతు శివ వైభవ్, ములుగుకు చెందిన సామ్రాజ్ క్రాంతి, ఎనుగుల నితిన్, నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యఠాకూర్ పట్టుబడ్డట్టు డీసీపీ వెల్లడించారు. కాగా, రాచకొండలో సురేందర్‌పై 44 కేసులు నమోదు కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని శాయంపేటలో తాజాగా రెండు కేసులు నమోదయ్యాయన్నారు.

ఈ సందర్భంగా గ్యాంగ్ సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి డీసీపీ రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, మామునూరు ఏసీపీ వెంకటేశ్, శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఎస్సై పరమేశ్వర్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన
సర్జన్స్ సదస్సు

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర విభాగం 11వ వార్షికోత్సవం శుక్రవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో గల ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో లాంఛనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, కాకతీయ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగాలు సంయుక్తగా నిర్వహిస్తున్నాయి. ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌దాస్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జీవన్‌రావు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, యువ సర్జన్లకు శిక్షణ తరగతులు, పీజీ క్లినిక్స్, చేతిపని శిక్షణ వంటి విద్యా కార్యక్రమాలను నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సంస్థ 1938లో స్థాపించబడిందని, దీని ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలోని సర్జన్లందరు ఒకేచోట కలుసుకొని వృత్తిపరమైన అనుభవాలు పంచుకోవడానికి అని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ కూరపాటి రమేశ్ తెలిపారు. చరిత్రాత్మకమైన వరంగల్ నగరంలో టీఎస్ ఏఎస్ఐ 11వ వార్షికోత్సవం జరగడం శస్త్రచికిత్సలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం సమకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ బి.ఆర్.సిద్ధార్థ, డాక్టర్ నాగేంద్ర, వివిధ మెడికల్ కళాశాలలకు చెందిన ఫ్యాకల్టీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

మార్మోగిన వందేమాతరం గీతాలాపన



ములుగులో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు



చిట్యాల మోడల్‌స్కూల్‌లో సామూహిక వందేమాతరం ఆలపన

ములుగు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహాకవి బంకిమ్ చంద్ర చటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ములుగు కలెక్టరేట్ సమావేశహాల్‌లో కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం ఉదయం అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావులతో కలిసి వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈసందర్భంగా కలెక్టర్ ూ ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని మరింతగా పెంపొందించేందుకు, భారతదేశ చరిత్రలో వందేమాతరం గీతానికి గల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు వీలుగా చేపడుతున్న వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా చేపట్టడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి జిల్లా పోలీస కార్యాలయంలో..

• వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపిం చారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీవో ప్రవీణ్, మండల పరిషత్ సిబ్బంది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈవో, అటవిశాఖ, ప్రభుత్వం, ప్రైవేటు జూనియర్ కళాశాల, పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగ్గా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయం, సింగరేణి జీఎం కార్యాలయాల్లో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఆయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• ములుగు రూరల్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమ్మక్క-సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సామూహికంగా వందేమాతర గేయాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద దీనిని నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెట్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం జరిగింది. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, సీడీపీవో రాధిక, ఐకేపీ ఏపీఎం, కాంగ్రెస్ నాయకుడు రామారావు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో వందేమాతరం సామూహిక గీతాలాపన కార్యక్రమాలు ఘనంగా సాగాయి. కాటారం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది వందేమాతర గీతాలాపన చేశారు. డీఈ నాగరాజు, ఏఈ ఉపేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, విద్యుత్ సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాలాలపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, స్థానికులు, కార్యాలయ ఉద్యోగులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఎస్సైలు సతీష్ కృష్ణప్రసాద్, ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు, ఎంఈవో వెంకటేశ్వర్లు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్, జీవవేణి, భాస్కర్, భారతి, శ్రీకాంత్‌తో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.



ములుగులోని గిరిజన యూనివర్సిటీలో...

జిల్లాకు ముగ్గురు ఎంపీవోల కేటాయింపు



కలెక్టర్‌కు పూలబొకే అందజేస్తున్న ఎంపీవోలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ద్వారా నియమి తులైన ముగ్గురు ఎంపీవోలు జిల్లాకు చేరుకున్నారు ఏటూరునాగారం ఎంపీ వోగా పి.వినయ్, తాడ్వాయికి జి.మహేందర్, వెంకటాపురానికి జి.జిమ్మిలాల్‌ను కేటాయించగా కలెక్టర్ టీఎస్.దివాకరను వారు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విధుల్లో చేరిన ముగ్గురిని కలెక్టర్ అభినందించారు. సమర్థంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

కొండ లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



కొండ లింగేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న నాగజ్యోతి

మంగపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపేటలో త్రిపురాంబిక సమేత కొండ లింగేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి హాజరయ్యారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్‌వర్మ, నరసింహారావు, గుండేటి రాజు, కొమరం సిద్ధు, గిడివాడ శ్రీహరి, గ్రామ పెద్ద గ్రామ శివయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెంకటాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గంగోత్రి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ గిరిబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రానికి తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజు, ఎస్సై చల్ల రాజు, ఏపీఎం ధర్మేందర్, సీసీలు భీవనాయక్, ఐలయ్య, గ్రామైక్య సంఘం సభ్యులు బోనాల కోమల, రెడ్డి మమత, గడ్డమీది సుకన్య, శైలజ, సెంటర్ ఇన్‌చార్జి శెట్టి రాజు, వీవో అధ్యక్షురాలు ఎమ్డీ.ఫరీనా, వీవోఏలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి : టీడీపీ

ఏటూరునాగారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిలువేరు అన్నమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొండాయి గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్సీ కాలనీలో గత ౨ రోజుల క్రితం కూలిపోయిన ఇంటిని ఆయన సందర్శించారు. వర్షాల ప్రభావంతో ఎస్సీ కుటుంబానికి చెందిన అంబాల శంకరయ్య, బతుకమ్మ ఇల్లు కూలిపోయి తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ



తాడ్వాయిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

తాడ్వాయి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలంగాణ జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను జన విజ్ఞాన వేదిక జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ క్రాంతి, కోకన్వీనర్ గడ్డం శ్రీనివాస్, కేజీబీవీ ఎస్‌వో పుష్పలీల, ఉపాధ్యాయులు రేణుక, చంద్రశేఖర్, శీరిష, ఎమ్మార్సీ సిబ్బంది నీలం బాబు, సారయ్య, సీఆర్పీసీ రమేష్, రవి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మంగపేటలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను కేజీబీవీ పాఠశాలలో ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లోని 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు చెకుముకి టాలెంట్‌టెస్టును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జేవీవీ మండల కన్వీనర్ క్రాంతి, కోకన్వీనర్ గడ్డం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అనిత, చంద్రశేఖర్, సమత తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

కన్నాయిగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రేవుల, బుట్టాయిగూడెం ఎస్టీ కాలనీలో సీతక్క తనయుడు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేయించారు. అనంతరం క్రీడా మైదానాలను చదును చేయించారు. గుర్రేవుల నుంచి చిట్యాల గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, మండల మహిళా అధ్యక్షురాలు అనిత, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానటరింగ్ మెంబర్ రాంబాబు, పూజారి సత్యనారాయణ, అరుణ్ కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కన్నాయిగూడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లి జెడ్పీ పాఠశాలలో పోలీసు షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పలు అంశాలపై షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సమ్ములాల్ మాట్లాడారు. సైబర్ నేరాలు, చట్టాల గురించి వివరించారు. షీటీమ్ కానిస్టేబుల్స్ మేరాజ్, బాలకృష్ణ, స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలం సర్వే



సర్వే చేస్తున్న సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మహదేవపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలో భక్తి కొట్టు ఏరియాలో గతంలో కస్తూర్బా పాఠశాల ప్రహరీ కోసం కేటాయించిన భూమి తమదంటూ పలువురు స్థానికులు నిర్మాణ పనులను అడ్డుకున్న నేపథ్యంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ రామారావు, సీఐ వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆ భూమిని సర్వే చేయించారు. ఏమైనా డాక్యుమెంట్లు ఉంటే తమకు చూపించాలని, అంతేగానీ ఇలా భూమి తమదంటూ పనులను అడ్డుకోవవడం సరికాదని సబ్ కలెక్టర్ అన్నారు.

మండలంలో పుట్ట మధు పర్యటన



బీఆర్‌ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొత్తపల్లిలో ప్రమాదంలో గాయపడి కాలుకు శస్త్రచికిత్స అయిన బీఆర్‌ఎస్ నేత కోట రమేష్‌ను పరామర్శించారు. సంఘటన వివరాలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మధు వెంట భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యువజన విభాగం మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్‌ఎస్ జిల్లా, మండల నాయకులు జక్కు రాకేష్, వెంకటస్వామి, గాలి సదువలి, మానెం రాజబాబు, శ్రీలక్ష్మిచౌదరి, శంకర్‌లాల్, ఉప్పు సంతోష్, బాలరాజు, మొండయ్య, దేవానాయక్, ప్రశాంత్, చీమల వంశీ, రవి, రాజేంద్రచారి, రాజ్‌కుమార్, రజాకర్, రజనీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టేకుమట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమన్‌పల్లిలో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలోని ఎస్సీకాలనీ ప్రజలు సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం ఆందోళనకు దిగారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్య హరీశ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా చలివాగు ఉప్పొంగడంతో మంచినీటి బావిలోని మోటారు పాడైపోగా సమస్య తలెత్తిందన్నారు. మోటారు బాగుచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు.

ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన ఏర్పాట్లు పరిశీలన

మహదేవపూర్ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : పలిమెల మండలానికి ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు రానున్న నేపథ్యంలో వారి పర్యటన ఏర్పాట్లను స్థానిక అధికారులు శుక్రవారం పరిశీలించారు. ట్రైనీ ఐఏఎస్‌లకు లెంకలగడ్డ ప్రాథమిక పాఠశాలలో వసతిని ఏర్పాటు చేయనుండగా ఇప్పటికే కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. తాజాగా డీఎంహెచ్‌వో మధుసూదన్, ఎంపీడీవో సాయిపవన్ శుక్రవారం పర్యటించారు. ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న వసతి ఏర్పాట్లను పరిశీలించారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో క్విజ్ పోటీలు

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాటారం జడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు శుక్రవారం నిర్వహించారు. టీ- శాట్, తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇవి జరిగాయి. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకత శక్తి, సామాజిక స్పృహ, అభ్యసనా సామర్థ్యాలను ప్రదర్శించారు. పరీక్షలకు కోఆర్డినేటర్‌గా టీచర్ సతీష్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని, మేధో వికాసాన్ని వెలికితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సోమలింగం, శైలజ, విజయ్‌బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జోనల్ క్రీడలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ములుగు టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకారం గురుకుల పాఠశాలలో 11వ జోనల్ క్రీడలు రెండో రోజూ హోరాహోరీగా కొనసాగాయి. శుక్రవారం జరిగిన క్రీడోత్స వాల్లో ముఖ్య అతిథులుగా కాళేశ్వరం జోనల్ ఇన్‌చార్జి అధికారి ఎస్.దేవసేన, ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి చంద్రకళ, సీఐ సురేష్, ఎస్సై చంద్రశేఖర్ హాజరయ్యారు. వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. అండర్ 14 చెస్ విభాగంలో జైపూర్ ప్రథమ స్థానం, రెండో స్థానంలో కాసీపేట విద్యార్థులు గెలుపొందారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో బెల్లంపల్లికి చెందిన సాయి చరణ్ ప్రథమ స్థానంలో నిలవగా రెండో స్థానంలో సిర్పూర్‌కు చెందిన కార్తీక్ గెలుపొందాడు. 400 మీటర్ల పరుగు పందెంలో సిర్పూర్‌కు చెందిన కార్తీక్ మొదటి స్థానం, కాసిపేటకు చెందిన మధు రెండో స్థానం, జాకారం గ్రామానికి చెందిన రాజు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్ 14 లాంగ్ జంప్ విభాగంలో కాసిపేటకు చెందిన మధు మొదటి స్థానం, సిర్పూర్‌కు చెందిన కార్తీక్ ద్వితీయ స్థానం, జాకారం గ్రామానికి చెందిన రాజు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీడీ వెంకట్ రెడ్డి, డీసీవోలు భిక్షపతి, జి. యాదగిరి, స్టాఫ్ సెక్రటరీ యాదగిరి, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, పీఈటీలు చంద్రమౌళి, సురేష్ బాబు, శ్రీను, సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో కాళేశ్వరం ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా గోదావరిలో భక్తులు ఉసిరికకాయలు వేసి స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి వచ్చి స్వామివారికి పలు రకాలు అభిషేకాలు, బిళ్వపత్రాలతో పూజలు చేశారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

వెంకటాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లగూడెం పంచాయతీ పరిధిలోని రామవరం, పర్శికగూడెం గ్రామాల్లో శుక్రవారం కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్యశిబిరాలు రిగాయి. ఈసందర్భంగా డాక్టర్ జ్యోతి గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. శిబిరాల్లో స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ లూర్థురాజు, వైద్యసిబ్బంది కోటిరెడ్డి, సభ్యులు గొంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, నరేష్, ఉష, పద్మ, రమాదేవి, స్వరూప, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



సాయిచంద్రను అభినందిస్తున్న కరస్పాండెంట్ సతీష్

చిట్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడితల శ్రీవివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థి పి.సాయిచంద్ర రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు శుక్రవారం అతడిని పాఠశాల కరస్పాండెంట్ గోల్ల సతీష్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ అండర్ 17 విభాగంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సాయిచంద్ర ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందకరమని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆయన వెంట పీఈటీ సంఘ రఘుపతి ఉన్నారు.

కొండెక్కిన పరిహారం!

(5వ పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన దళిత మహిళను దూషించిన ఘటనలోనూ 2022లో కేసు నమోదు కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ. 75వేల సాయం మాత్రమే అందిందదని తెలుస్తోంది.

కేసులు.. బకాయిలు

అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం భూపాలపల్లి జిల్లాలో మొత్తం 45 అట్రాసిటీ కేసులు నమోదు కాగా సుమారు రూ. 66 లక్షల 90వేల పరిహారాన్ని చెల్లించాల్సి ఉంది. ఇవి కాకుండా 2020లో నమోదైన మరో రెండు కేసుల్లో రూ. 5 లక్షల మేరకు చెల్లింపులు జరపాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో మండలాల వారీగా పరిశీలిస్తే.. కాటారం మండలంలో మొత్తం ఆరు కేసులకు రూ. 6.50 లక్షలు, మహదేవపూర్ మండలంలో ఏడు కేసులకు సంబంధించి రూ.5.15 లక్షలు, పలుమెల మండ లంలో రెండు కేసులకు సంబంధించిన బాధితులకు రూ.4.50 లక్షలు, మల్హర్ మండలంలో రెండు కేసుల్లో రూ. 5.25లక్షలు, మహాముత్తారంలో నాలుగు కేసులకు సంబంధించి రూ. 4 లక్షలు, భూపాలపల్లిలో 11 కేసులకు సంబంధించి రూ. 15.50 లక్షలు, గణపురం మండ లంలో మూడు కేసులకు సంబంధించి రూ. 3.75 లక్షలు, రేగొండ మండలంలో నాలుగు కేసులకు సంబంధించి రూ. 7.50 లక్షలు, చిట్యాలలో మూడు కేసులకు సంబంధించి రూ.6.75 లక్షలు, మొగుళ్లపల్లిలో రెండు కేసుల్లో రూ. 3 లక్షలు, టేకుమట్ల మండ లంలో మూడు కేసుల్లో రూ. 4 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ కేసులన్నీ కూడా దాదాపు 2020 నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

అగ్రిమెంట్ తర్వాతే మొక్కజొన్న సాగు చేయాలి

వెంకటాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతనే రైతులు మొక్కజొన్న పంటను సాగు చేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్ సూచించారు. ఈమేరకు శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం మొక్కజొన్న విత్తనోత్పత్తిలో తలెత్తిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతులు మోసపోకుండా ముందస్తుగా అగ్రిమెంట్ చేయించుకోవాలని సూచించారు. రైతులు కంపెనీల డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లులు తీసుకోవాలని, అగ్రిమెంట్, బిల్లులు పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. పంట పెట్టుబడికి కంపెనీ డీలర్లు ఇచ్చే డబ్బులు బ్యాంకు అకౌంట్ ద్వారానే జమ చేసుకోవాలని, నగదురూపంలో తీసుకోవద్దని అన్నారు. కంపెనీల ఆర్గనైజర్లు రైతులకు ఇచ్చే ఎరువులు, పురుగుమందులు లైసెన్స్ దుకాణాల వద్దనుంచి అందజేయాలని అన్నారు. రైతులకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.